క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకతను సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడి నియామకం



కృష్ణాయాదవ్

మద్దికెర: వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా కృష్ణాయాదవ్‌ను ఎంపిక చేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల ఉపాధ్యక్షుడుగా ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కార్యకర్తల సమస్యలతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ రానున్న ఎన్నికల్లో విజయం సాధించేలా కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయం నందు ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పెన్షనర్ల పితామహుడైన కీర్తిశేషులు డీఎస్ నకారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సత్కరించారు. పెన్షనర్లకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆ సంఘం అధ్యక్షుడు ఏపీ వీరన్న, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు




హొళగుంద సిద్ధేశ్వర స్వామి మూలవిరాట్

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామికి ధనుర్మాసం సందర్భంగా ఆదివారం రుద్రాభిషేక పూజలు వైభవంగా జరిగాయి. మొక్కుబడులున్న భక్తులు తెల్లవారుజామున స్వామికి జలాభిషేకం, మహామంగళారతి, ఆకుపూజతో పాటు రుద్రాభిషేక పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. దాదాపు నెల రోజుల పాటు జరిగే నిత్య రుద్రాభిషేక పూజలు వచ్చే నెల 15న ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచండి



తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

తుగ్గలి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు నిఘా పెంచాలని పత్తికొండ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి తుగ్గలి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తూ బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌ఐ మల్లికార్జునకు సూచించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెంట ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం
- బోగోలు చెరువులో గంగమ్మ పూజ చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



బోగోలు చెరువులో గంగమ్మ పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు హంద్రీ–నీవా జలాలను చెరువులకు మళ్లించి నీటితో నింపుతున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె ఆదివారం వెల్దుర్తి మండల పరిధిలోని బోగోలు చెరువులో గంగ పూజ నిర్వహించారు. హంద్రీ జలాలతో చెరువు నింపడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ గంగమ్మకు వాయనం సమర్పించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా ద్వారా రైతులకు సాగునీరు అందించడంతో పాటు, ఆయా గ్రామాలలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. పత్తికొండ నియోజకవర్గంతోపాటు, డోన్, కల్లూరు మండలాల చెరువులకు నీటిని నింపి అపర భగీరథులయ్యారన్నారు. రైతులు బాగుండాలని తద్వారా సమాజం బాగుంటుందన్నదే తమ పార్టీ ధ్యేయమన్నారు. బోగోలు గ్రామ చెరువును నింపడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి పెద్ద కుల్లాయి కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గ్రామ నాయకులు వెంకట్రామిరెడ్డి, కమలాకర్, ఎంపీటీసీలు లావణ్య, నాగార్జునరెడ్డి, శ్రీరంగాపురం, గువ్వలకుంట్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా కమిటీలకు నియోజకవర్గాల వారీగా ఎంపికైన నాయకులు పార్టీ బలోపేతానికి కష్టించి పనిచేయాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. కష్టించి పనిచేసే వారికి పార్టీల్లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. పార్టీ అనుబంధ విభాగాల సభ్యులుగా ఎంపికైన వారికి దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ చేసిన మేలును వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేలా చైతన్యం చేయాలన్నారు. మండల, గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

హిందూ ధర్మ ప్రచారంలో ముందుండాలి



కోయిలకొండలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజ చేస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాతం– ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో మందిర నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పాల్గొని శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ధర్మ ప్రచార కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎంపీపీని శాలువతో సన్మానించారు. ఎంపీటీసీ తలారి కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, గోవిందరాజులు, పురుషోత్తం, బాలు, సంజీవుడు, బాలమద్దయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



హలిగేరలో ప్రచారం చేస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రబోధ సేవా సమితి గుత్తి, ఎనుగు మర్రి, జొన్నగిరి, తుగ్గలి కమిటీ అధ్యక్షుడు రమికుమార్, మోహన్‌కృష్ణ, దేవేంద్ర, చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదివి అందులో సూచించిన సద్గుణాలను పాటించాలన్నారు.

నందవరం: త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనంతో దైవ సముపార్జన పెంపొందుతుందని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అయిజ కమిటీ అధ్యక్షులు నరేష్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సోమలగుడూరు గ్రామంలో భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠనం చేయడం ద్వారా జ్ఞాన సముపార్జన లభిస్తుందన్నారు. జీవన శైలిలో మార్పు కలగడంతో పాటు దైవ భక్తి, క్రమశిక్షణ అలవడుతుందని వివరించారు.

టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ఇక హొళగుంద సెక్షన్‌లో ఎల్లెల్సీలో నీటి ప్రవాహం ఆశాజనకంగా ఉంది. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లీ, వరనాడు, శివమొగ్గ, చిక్ మంగళూర్ తదితర దక్షిణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో నీటి చేరిక నిలిచింది. ఈ ఏడాది డ్యాంకు వరద ముందుగానె మొదలైనా ఆ తర్వాత వర్షాభావం కారణంగా నీటి చేరిక తగ్గిపోవడంతో జలాశయంలో నీరు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం డ్యాంలో 1590 అడుగులతో 11 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఇక 1,916 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి కాలువలకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి 84.832 టీఎంసీల నీటి నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 2,495 క్యూసెక్కులుండేది. ఇక జిల్లాలో ప్రవహించే దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఎమ్మెల్యే చొరవతో కాలనీల అభివృద్ధి

మద్దికెర: మండల కేంద్రంలోని సాయినగర్, రాంనగర్ కాలనీలు ఏర్పడి 30 ఏళ్లయినా ఏ నాయకుడూ పట్టించుకోలేదని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి పాటు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు సోము, కాలనీవాసులు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతేగాక సీసీ రోడ్లు నిర్మించాలని గతంలో డిప్యూటీ సీఎంను అడిగినా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కృషితో ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.32 లక్షలతో ఇంటింటికీ కొళాయిలు వేస్తున్నారని, అలాగే సీసీ రోడ్లు, బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. కాలనీలో సమస్యలు పరిష్కరించిన తర్వాతే ప్రజలను ఓట్లు అడగడానికి మళ్లీ వస్తానని చెప్పిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇచ్చిన హామీ మేరకు సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారన్నారు. కాలనీ అభివృద్ధికి కృసి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసులు లింగరాజు, నారాయణ రెడ్డి, వీరేష్, చెన్నప్ప తదితరులు ఉన్నారు.

వైభవంగా షష్టి ఉత్సవాలు

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దమ్మ చెరువు కట్ట మీద వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి పూజ, కుంకుమార్చన, స్కంద హోమం, మహా మంగళహారతి, హోమాలు నిర్వహించారు. భక్తులకు అర్ధగేరి రామకృష్ణారెడ్డి కుటుంబీకులు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తిని, చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, బాణాసంచా పేల్చుతూ వైభవంగా ఊరేగింపు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్పరిలో నేడు..

ఆస్పరి: ఆస్పరిలోని ఆంజనేయ స్వామి ఆలయం, రామతీర్థంలో వెలిసిన సుబరమణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కిరణ్‌కుమార్, రూపామోహన్ శర్మ ఆదివారం తెలిపారు. ఆలయంలో స్వామి వారికి గంగపూజ, అభిషేకం, సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, ఆంజనేయ స్వామి మూలమంత్ర హవనం, జయాధిహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు తదితరకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

20 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా ఎస్సీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ప్రేమరాజు, అరుణ్‌సాగర్, రామన్న, చిన్నబాబు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.15,016, రెండవ బహుమతి రూ.7,016, మూడవ బహుమతి రూ.3,016 అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 19వ తేదీలోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. పోటీలు ఎస్సీ కాలనీలో జరుగుతాయన్నారు. వివరాలకు 79974 34655, 62815 38533 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం



పాల్గొన్న పీఠాధిపతి శంభులింగయ్య స్వామి



లక్ష దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లిలో పట్టద స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం వైభవంగా జరిగింది. మఠం పీఠాధిపతి శంభులింగయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మఠం పీఠాధిపతి చేతులమీదుగా మహిళలకు ఒడిబియ్యం కార్యక్రమం ప్రారంభించారు. మఠం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. సాయంత్రం లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక పురాణం కార్యక్రమం చేపట్టారు. పెద్దఎత్తున్న భక్తులు పాల్గొన్నారు.

జోరుగా సీసీ రోడ్ల నిర్మాణం



తెర్నెకల్‌లో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించినట్లు సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రతి మండలానికి అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షలు కేటాయించిందని ఈ మేరకు తెర్నెకల్ గ్రామానికి రూ.15 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీపీ దాసరి లక్ష్మీదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, నాగన్న, యేసేపు, కోటిరెడ్డి, మాల సూరన్న తదితరులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

రమణీయం.. చెన్నకేశవ స్వామి రథోత్సవం



మొలగవల్లి గ్రామంలో రథాన్ని లాగుతున్న భక్తులు

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం రమణీయంగా సాగింది. ఉత్సవానికి ముందు చెన్నకేశవ స్వామి, లక్ష్మీ సమేత భూదేవిల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం జరిగిన రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్థానిక ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. ఉదయం స్వామి వారికి గంగ పూజ, పంచామృతాభిషేకం, మహామంగళ హారతి వంటి తదితర ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి ఆలయ నిర్వాహకులు కిష్టప్ప, వైస్ ఎంపీపీ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, సొసైటీ డైరెక్టర్ మారెప్ప, గ్రామ నాయకులు రామాంజి, గోవిందు, తిక్కన్న లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

నేడు కుడుములాట

ఉత్సవమూర్తులను సోమవారం హనుమద్వాహనం, అశ్వవాహనం, గరుడు వాహనంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించనున్నారు. అంతకు ముందు గ్రామస్తులు ఇరువర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు కుడుములను విసురుకోనున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రామేశ్వర రెడ్డి

గోనెగండ్ల: ఔట్‌సోర్సింగ్ లస్కర్లు విధులు సక్రమంగా నిర్వహిస్తే రైతులకు సక్రమంగా సాగునీరు అందడమే గాక రెగ్యులర్ లస్కర్లకు పనిభారం తగ్గుతుందని ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయిస్ సంఘం రాష్ట్ర నాయకులు రామేశ్వర రెడ్డి, అంజనేయులు అన్నారు. ఆదివారం గాజులదిన్నె ప్రాజెక్టు ఆవరణలో ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లస్కర్లు రాత్రింబవళ్లు రైతుల శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేస్తున్నారని, అయినా కొందరు పనిగట్టుకుని లస్కర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. అనంతరం ఏపీ ఇరిగేషన్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.కిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎ.రామేశ్వరరెడ్డి, కోశాధికారిగా డి.అంజినయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పి.ఉగ్రనరసింహుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మగ్బుల్ బాష, కో ప్రెసిడెంట్‌గా రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఖాజా, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, సలాం, పెద్ద హనుమంతు, బజారి రెడ్డి, నరసప్ప, జాయింట్ సెక్రటరీగా తిరుపాల్, మల్లికార్జున, మల్లయ్య, మహబూబ్ బాష, మాదన్నలను ఎన్నుకున్నారు. ఆదోని డివిజన్ లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇష్టంగా చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని వక్తలు సూచించారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉస్మాన్‌బాష ఆధ్వర్యంలో ఆదివారం పలువురు ప్రముఖులచే అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రేరణ, స్మృతి విషయాలను విద్యావక్త మాధవస్వామి వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్నతోపాటు ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, అయ్యస్వామి, సుదర్శన్, వెంకట్రాముడు ఆఖరి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకునేందుకు మెలకువలను తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్‌డబ్ల్యూఓ తెలిపారు.

నాడు–నేడు ప్రగతి చూడు



నేడు : బసినేపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు.



నాడు : గతంలో అధ్వానంగా ఉన్న కాలనీ

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో రూ.4 లక్షలతో సీసీ రోడ్లు వేసినట్లు మార్కెట్ యార్డు డైరెక్టర్ భద్రయ్య ఆదివారం తెలిపారు. గ్రామంలోని వీధుల్లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. దీంతో సచివాలయ నిధులతో శరవేగంగా సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. రోడ్లు నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థి




జాతీయస్థాయికి ఎంపికైన గణేష్ ఆచారి



స్టేట్ మీట్ రిలేలో పతకం సాధించిన సి.మహేంద్ర

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న కె.గణేష్ ఆచారి జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈనెల 11న ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్ మీట్ త్రోబాల్ పోటీలో కె.గణేష్ ఆచారి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో గణేష్ పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ఈనెల 14న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన 4,400 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్‌మీట్ రిలేలో ఇంటర్ విద్యార్థి సి.మహేంద్ర ప్రథమం స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యతో పాటు క్రీడాల్లో రాణిస్తున్న గణేష్, మహేంద్రలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



నదికైరవాడిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: పల్లెల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని నదికై రవాడి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.15 లక్షలతో గ్రామంలో ఎంపీపీ పాఠశాల నుంచి సుంకులమ్మ దేవాలయం వరకు, సుభాన్ బీ ఇంటి వద్ద నుంచి మొయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రెండు రోజుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే కొత్తకై రవాడి గ్రామంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో డ్రైయినేజీలు, 20 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి చేశామని తెలిపారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, డీలర్ వెంకటేష్, చిన్న తదితరులు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

కైరుప్పలలో నేడు ప్రేమికుల నిశ్చితార్థం

- పెద్దల సమక్షంలో వీరభద్రస్వామి, కాళికాదేవిల పెళ్లి ఖరారు
- సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గ్రామస్తులు



కైరుప్పలలో వెలసిన కాళికాదేవి



వీరభద్రస్వామి

ఆస్పరి: రాష్ట్రంలో పిడకల సమరం (నుగ్గులాట) అంటేనే టక్కున గుర్తుకొచ్చేది ఆస్పరి మండలంలోని కైరుప్పల గ్రామం. ఆ నుగ్గుల సమరానికి కారణమైన వీరభద్రస్వామి, కాళికాదేవిల (భక్తులు ప్రేమికులుగా భావిస్తున్న) పెళ్లికి పెద్దల సమక్షంలో సోమవారం నిశ్చితార్థం పెట్టనున్నారు. మండలంలోని కై రుప్పలలో అనాధిగా వస్తున్న సంప్రదాయాన్ని ఇప్పటికి గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. గ్రామ పెద్దలు చెబుతున్న ప్రకారం కైరుప్పలలో వెలసిన అగ్ర కులానికి చెందిన వీరభద్రస్వామి, వెనుకబడిన వర్గానికి చెందిన కాళికాదేవిని ప్రేమిస్తాడు. ఆ తరువాత కాళికాదేవిని పెళ్లి చేసుకోనని వీరభద్రస్వామి చెప్పడంతో ఆ వర్గీయులకు ఆగ్రహం కలుగుతుంది. ఒక రోజు వీరభద్రస్వామి గుర్రంపై కై రుప్పల వీధులో వెళుతుండగా కాళికాదేవి వర్గీయులు అవమానించే విధంగా పేడ వేస్తారు. ఇది తెలుసుకున్న వీరభద్రస్వామి వర్గీయులు అక్కడకు చేరుకుని కాళికాదేవి వర్గీయులపై పేడ వేసి వారిని అవమానిస్తారు. వీరి ప్రేమ వ్యవహారం తెలుసుకున్న ఇరు వర్గాల పెద్దలు సమస్యను పెద్దదిగా చేయకుండా వారిని ఒక్కటి చేసేందుకు నిశ్చయించుకుంటారు. పెద్దల అంగీకారం మేరకు ఏటా కార్తీక మాసం ముగిసిన తరువాత మొదటి సోమవారం వీరభద్ర స్వామి, కాళికాదేవి నిశ్చితార్థ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. స్వాములకు ఇప్పుడు నిశ్చితార్థం చేసి ఉగాది పండుగకు పెళ్లి కార్యక్రమం జరుపుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది పండగకు కై రుప్పలలో పిడకల సమరం (నుగ్గులాట) జరుపుకుంటున్నట్లు చెబుతున్నారు. పిడకల సమరం తరువాత ప్రేమికులు వీరభద్రస్వామి, కాళికాదేవిల పెళ్లి ఘనంగా జరుపుకుంటామని గ్రామ పెద్దలు చెబుతున్నారు. నిశ్చితార్థం సందర్భంగా సోమవారం వీరభద్రస్వామి, కాళికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.